# సింతసివురు

## 'రమణశ్రీ'

'సింత సివురు సిన్నది
సొగసు వయసు పిన్నది
సీకు సింత లేనిదీ
సెంత సేర వన్నదీ'

'సెం...త...సేర...వన్న...దీ'

గాలిలో తేలిపోతోన్న మాటలు, పాటలూ చింతచెట్టు చివురుల్ని మరింత చివురింపచేస్తున్నయ్! చింతచివురు కోసుకొంటోన్న నాగులు కొమ్మల కింద నుంచి, తొంగి తొంగి చూసింది పాట పరుగుల్తో వస్తోన్న వెంపు...

గొఱ్ఱెలూ, మేకలూ కాసుకొంటోన్న గొఱ్ఱెల మఙ్గాలమ్మ కొడుకు 'సిన్నోడు' పాడుతోన్న పాట!

'సిటారు కొమ్మని సివురుంది
కొయ్యగబోతే జారతంది'

నిజంగా తన పసలానే వుంది! తొలకరించిందని, చెటు పులకరించితే, ఆ చివుళ్ళు తను గిల్లుకుపోయి, అమ్ముకొని సొమ్ము చేసుకొంటుంది.

'సింత సివురు సిన్నదాన్ని సీము కుట్టింది
వయసు పొగరు పిల్లదాన్ని దోమ కుట్టిందీ'

పాట విని నవ్వుకొంది. 'ఓ సబ్బో! పాడ తన్నాడు పాట. కోడె వొయసులో పొగరెక్కి...' అనుకుంటూ—

నిజంగా కండచీమలు కండ లూడ బెరుకు తున్నయ్. నిగనిగలాడుతోన్న వంటి వట్టిపెట్టుకొని కళు బయర్లు కమ్మేలా ఐనా గోళ్ళు గిల్లడం మాన లేదు చివుళ్ళని.

అదీగాక కాయన్న మాన్నెంలో చెట్టంటే, అందరికీ ఆశే! ఇక పచ్చగా పకపకలాడుతోన్న చెటుని చూసి, నాగు లూరుకొంటుంది?

'నీ యిట్టం వొచ్చినట్టు కోసుకోయే పిల్లా!' అని కాయన్న అధికారం ఇచ్చాడు.

ఒడినిండా కోసుకొని చక్కా బజాగున పడి ఇన్ని గింజలకో, డబ్బులకో అమ్ముకొని ఆ రోజు వెళ్ళ మారిస్తే అదే పదివేలు! రేపటిరోజు దేవు డెరుగు!

పైకొమ్మలు కూడా ఎక్కికోసింది......ఒడి నిండించికొని, పిటపిటలాడుతూ కిందికి దిగింది.

పొద్దు, తాటితోపులోంచి వాటారుతోంది.

రెండు వీథులు తిరిగితే చాలు...చింత చివు రంతా ఆఖరు...ఇంకా గరువుమీద గొఱ్ఱెల సిన్నోడు కూనిరాగం తీస్తున్నాడు.

'చొంతంగా కపిత్తం గడతాడంట! ఆడికి పుట్టిక నించీ వొచ్చును పాటలూ, పదాలు, గొల్ల సుద్దులూనూ' అనుకొంటూ గట్టెక్కింది నాగులు.

'తొలకరి వరిసించీ
సింతలు సివురించీ
పచ్చిక పరిసింది
నాగులూ నీ దేవూరే?'

పాట ఆగింది—పాట పాడింది తను కావట్లు మూశాడు సిన్నోడు.

'ఏరా! సిన్నోడా!... తెగ పాట పాడతన్నావ్ నామీదే కపిత్తం గడతన్నావా?...నాదీవూరే గదరా సిన్నా!'

ఒడిలో చింతకూర చేతుల్తో సద్దుతూ అంది.

'ఇయ్యాల ఈకుంటావు. రే పెక్కడుంటావో? ఎవరి కెరిక? నాగులూ!...కాయన్న సెటంతా యిరగ్గో సేశావు గందా?...సెట్టెందుకన్నా పనికొస్తదే? నీ సేయి దగిలి...కాయన్నతో సెపుతాలే! నీ పని...'

'సెపితే సెప్పుకో! సెప్పిచ్చి కొట్టుకో! సెపితే కొరతే యిస్తాడా?'

'కొరతే యిస్తాడో? కొరుక్కుతింటాడో నా కేటి తెలుస్తది?'

'నోరు తిన్నగా రానీ సిన్నోడా! నేవలాంటి దాన్ని గాను! సేరగున్నానని, తెగ నీల్గుతుండవు. ఊరికే కపిత్తం గడతన్నావు!'

'నా నోటికొచ్చిన పాట పాడతాను! నీకేం?' అని వడిలో కూర తీసుకొని నవ్వుఁల్తూ, 'దానికేం గాని, గురవన్న మావఁ సిన్నాదిలి యేసకు పోయినోడు? నువ్వెన్నాళ్ళిట్టా వుంటం...' అని ఆగి, నాగులు కళ్ళలోకి ప్రశ్నార్థకంగా చూశాడు. నాగులు కీ మాటలు దురుగ్గా అంటాయి.

'ఏమో నాకేటి తెలుసు' అని గట్టు దిగి పొలాల కడ్డంబడి నడక సాగింది.

'సిన్నపుడే పెళ్లాడిన గురవన్న మావ, సంసారం సేస్తానే, ఓ రోజు మాయమైపోనాడు...అంతు సిక్కని దూరాలకి'

సిన్నోడు నాగులు దారి నేమూస్తూ గొర్రెల్ని మేకల్ని మళ్ళించుకొంటున్నాడు.

పాతగాయం రేగినట్టుంది...మెన బావురుమంటోంది—ముక్కూ మొగాఁకీ నగలూ నాణాలూ లేవు...అన్నీ ముసలయ్య రోగాల్లో కరిగిపోయాయి. గురవన్న జాడ తెలియదు నేటివరకూ....

'ఎంతకాలం మగపురుగున్నమ్మకోమంటావు! ఆడికోసం ఎన్నాళ్లని ఎదురుసూడ్డం...సింత సెటు బావున్నంతకాలం నీకు సింతలేదు...!' అంటోంది. మనసు.

తుమ్మ తోపులోంచి, వీస్తోన్న ఈదర గాలి, వర్షించబోయే మబ్బుల తొందర...

వయ్యారంగా కనుపద్పగా ఉయ్యాల లూగుతూన్న ఆకుమళ్ళు...దాటుకొంటూ వడిలో కూర మప్పితంగా సద్దుకొని, రైలు గేటు దాటింది.

'ఎంతకన్నా తగ్గావోడే! మర్రాలమ్మకొడుకు. యిసిరి యిసిరి...ఎంత మాటన్నాడు...మారు మనువు సేసుకోమని, మనసు మార్చుకోమని...మా యిదౌతున్నారు...కూడెంలో వోళ్లు—గురవన్న మావఁకోసం ఎదురుసూసి, ఎదురుసూసి పేనాలన్నా యిత్తాగాని, మనువు సేసుకోను...మొగోణ్ణి నమ్ముకు సెడమన్న దెవరు? మరొకర్తె నదురుగా అనితే సాలు...తిన్నాదిలి పారిపోతాడు......మనువు సేసుకొన్నావోడు మాయలోడైతే బతుకు మరేంగాను"

కావేలమ్మ గుడిదగ్గరి కొచ్చింది. గుడిలో అమ్మవారికి వంగి వంగి మొక్కింది. 'గురవన్న మావఁని దూరం సెయ్యకు తల్లీ!' అని......

తల్లి, 'నీమొరాలించాలే' అన్నట్టు చూసింది దయామయంగా. గుడికెదురుగా గంగరావిచెట్టు కింద ఒకక్షణం కూర్చొని, లేచి, చకచః నడుచుకొంటూ వీథినిపడింది......

'అమ్మా! చింతకూర...' అని ఆగింది గుమ్మం ముందు...ఇంటావిడ 'అబ్బే! బొతుగా తక్కువ పెడుతున్నావు! కొనాలా పెటాలా? ఊరికే నే వచ్చిందికదూ? ...... మరింత పెడితే నీసొమ్మేం పోయింది?' అంటోంది—చేట తెచ్చి బియ్యం వేసి కూర పెట్టించుకొంటూ.

ఇంట్లో వాళ్ళేదో గొణుక్కుంటున్నారు.

'అబ్బే వాళ్ళకి పెళ్ళీ పెడాకులూ ఏవిఁటీ? వట్టి పశువులు...'

ఇంటావిడ పగలబడి నవ్వుతోంది.

నాగులు చెవుల్ని కొరుకుతున్నయ్ వాళ్ళ మాటలు...

నీతికీ, నిజాయితీకి తనేం తక్కువకాదు...

త్వరగా, కూర పూర్తిచేసి సంత చేసుకొని, గుడిసెకి మళ్ళింది.

ఆకాశం మబ్బుపట్టి మరింత చీకటి పెంపొందుతోంది. చిన్న చిన్న తుప్పరపడి. నాగులు వంటిమీదబట్టలు తడిసి, ముడుచుకుపోతున్నాయి. ఎదురుగాలి ముఖాన్ని మొత్తుతోంది. చలని గాలికి ముడుచుకొన్న పెదవులు మండుతున్నాయి. ఎదుగొస్తోన్న పసువుల్నీ, పసుల కాపరుల్నీ తప్పుకొంటూ, మళ్లా గుడిసెదగ్గరి కొచ్చేసరికి ముసురు మరింతగా విసురుతోంది. ఐనా, గేటుదాటి రైలుపట్టాలవెంట నడిచి, ఆలోచనల ముళ్ళు విప్పుకొంటూ గూడు చేరేసరికి, గుడ్డిదీపం వెలిగించమని ముందుకొస్తోంది.

తుక్కునులకమంచంమీద ముసలయ్య ఖళ్లుఖళ్లున దగ్గుతూ, 'ఏటి నాగూ? సిరసాన్నల్లేంది దీపమేం ఎలిగిత్తావు?...సంతసేసుకొచ్చావా?' అన్నాడు.

'ఆఁ' అంది.

'ఏడన్నా ఊకుతున్నారా? ఊడిస్తే మన ఏడుపు కొంత తీర్తది'

‘ఆకు లెవగండే యేం వూడుత్తారు? బోరింగులున్నా వోళ్ళు మాతరం, అరకలు గడతన్నారు...’

‘ఎంతకాలం సింతసివురుమీన బతుకుతాం! నువ్వు మనువుసేసుకో! ఓ లొస్తది...దాంతో కాలచ్చేపం సెయ్యొచ్చు...ముద్దూ ముచ్చటా తీరతది. ఇంకా గురివిగాడొచ్చేది నేదు...’

అని ఆగాడు. మళ్ళీ దగ్గు లంకించుకొంది.

మంచం మన్నైపోతన్నాడు ముసలయ్య... ఉన్నన్ని రోజులూ కమతంలో కాపుదనాలుండి, పేరుదెచ్చుకొని, చివరికిలా చావుబతుకుల మధ్య వేలాడుతున్నాడు. అడుగుబడుగూవున్న చమురుపీల్చి దీపశిఖ వెలుగుతోంది. నాగులు రాజబెట్టినపొయ్యి ఆకలిగొన్న కడుపులా రగుల్తోంది.

గురివిగాడు పోయిన్నాటినించీ, బతుకు బండలై పోతన్నాది. కూటికీ కుమ్మకూ మొగం వాసిపోనాం...ఏటి పోగాలమో, ఆడుపోనాడు ఏలినాటి శని బట్టుకొని యేడిపిస్తన్నాది...’ అని గొణుక్కుంటున్నాడు ముసలయ్య.

‘మనువుసేసుకో! మనువుసేసుకో!’ అని గుండెల్లో గూళ్లు కట్టుకొని పోరుపెడుతున్నాడు ముసలయ్య. నాగులకీ మాటలు వళ్లు మండిస్తున్నయ్!

ఏటిలోకం ... సిగ్గూసెరం నేదు గూడెం వోళ్లకి...చొక్కాలు మార్చుకొన్నట్టు మార్చుకోడం ఏటిబతుకు?...’ అని యీసడించుకుంది.

మంచంమీద ముసలయ్య నిద్రపోతున్నాడు. గుడిసెముందు చీకటిపక్షి వర్షంలో తడుస్తూ టప టప లాడుతూ ఎగురుతోంది!

## 2

‘మారుమనువు సేసుకొని మనుసులిరుసుకొని, ఏటి బతికేది కాయన్న బాబుగోరూ!’

తిరిగి చివురించిన చెట్టెక్కుతూ అందినాగులు. కాయన్న పిరగాళ్లకు నీరు పెడుతున్నాడు. పాలికాపు దూరంగా పల్లంమడికి నీరు పొంగకండా గట్టు సరిజేస్తున్నాడు.

కాయన్న నాగులు మారుమనువునిగురించి అడిగినట్టున్నాడు జవాబు చెబుతూ చెట్టెక్కుతోంది.

‘సెటంతా నువ్వే యిరిసేనాగున్నావే! సింతలు పండకపోయేనో, నీతోలొలుస్తా!’ అన్నాడు వెటకారంగా...

‘నానొక్కదాన్నే నేటిబాబూ! నా పిల్లాజెల్లా ముంగుతిరంఅంతా నీ సెట్టమీనే బతుకతాం... నీ పేరు సెప్పుకొండి’ అంది ... చెట్టుకొమ్మమీద పద్దుకొని...

వంట్లో నలతగా వుందేమో నీరసంగా వచ్చింది మాట...

‘పేవం బాగోలేదు...ఐనా తప్పదు ...ముసలయ్యకింత గంజి పొయ్యకపోతే, గింజుకొంటాడు’ అనుకొంటూ.

సెట్టెక్కినందుకు నాకేటిస్తవే? సింత సివురు సిన్నదానా?’ అన్నాడు కాయన్న.

దొరబాబులు మీకు నానించేటి కావాలి? వోళ్ళు కాసితాలా? మడులు కాసితాలా? నీబానిచలం పాలించేవోళ్ళు మీరూ...ఆలించే వోళ్లం మేమూ... మీ మాట సట్టం గాదూ బాబులూ”

‘ముసలయ్య కెలాగున్నదే?’

‘ఎలాగున్నదేటి బాబూ! గుమ్మంలో కాసుకూచున్నది సావు’

‘పాపం! కమత మున్నంతకాలం యిస్వాసంగల కుక్కలా పడుండేవోడు...ఒక్కమాట పడేవోడు గాదు, పౌరుసంగా బతికేవోడు—’

వర్షించి మెరిసే మబ్బు, కొమ్మ మీదవాలి నటుంది నాగులు! కోకిల కూస్తున్నట్టు ... పుల్లని చింతచివురునవుల్తాన్నట్టు ...కొండగాలి వీస్తున్నట్టు ...అనిపిస్తోంది కాయన్నకి.

మడిలోకి నీరుమళ్ళిస్తూ గుండె కుదురుచేసుకొంటున్నాడు. పాదరసంలా పాకుతోంది మనసు పరిసరాల మీదికి.

ఎందుకా చిన్నదానితో మానసిక వ్యభిచారం? తన అంతిస్థేమిటి? దాని పరువెక్కడ? వాసనచూడ్డానికైనా తగని వస్తువు.

‘బాబూ నీబానిసని’

తనబానిస...తన కోర్కెలు తీర్చగలబానిస...

చింతచివురు కోసుకుపోయేదాకా అలానే మాట్లాడుతుంది గట్టదిగాక, 'బోడి కాయన్నా!' అని పగలబడి నవ్వుతూ పారిపోతుంది!

నాగులుకి ఎదురెండ ముఖంమీద కొడుతోంది. పొద్దున్నింకా చదిగంజి తాగక, వంట్లో నలతగావుండి శరీరమంతా సెత్తుగుమరుగుతోంది.

కళ్లు తిరుగుతున్నయ్. కాళ్లు లాగుతున్నయ్... చింతచివురులు లోకువగట్టి వేళ్ళని తోసిపారేస్తున్నయ్...

గభీల్‌మని పడిన చప్పుడు వినిపించకుండానే, కాయన్న చెట్టుకిందికి లంఘించి ఒక్క ఉదుటన పట్టుకొన్నాడు నాగుల్ని...

నాగులు కాయన్న చేతుల్లో వాలిపోయింది అరమోడ్పుకనుల్లో సొగసులు బంధించుకొంటూ.

'హోసి నీ యిల్లువళ్లా బంగారంగానూ! కళ్లు తిరుగుతుంటే యెక్కకపోతే యేమే? పాపం దెబ్బ తగిలిందా?'

నాగులువళ్ళు చచ్చిపోయింది కాయన్న స్పర్శకి. కళ్లు సిగ్గుతో తడిసి నానిపోయాయి. ఇంత వళ్లు తెలియకుండా పడిపోయినందుకు శపించుకొంది.

కాయన్న కామోద్రిక్తమైన వేళ్లు ఆ వంటి చిరువేడిమీద పరవశం పొందుతున్నాయ్! కళ్లల్లో ఆశ కోరగా చూస్తోంది. యౌవనందిగజారుతోన్న ముఖం... పెదవుల్లో పేరుకొన్న కోరిక...

ఆచూపుల అర్థాన్ని భరించలేక త్రాచులా రోజుతూ, లేచి దూరంగా నిలబడింది.

"కాయన్నబాబూ! నావొళ్లు ముట్టకండి! నాను పాపం సేసుకుపుట్టాను. నాది యెదవజల్మ... నాకరమాన నన్ను పోనీండి! నామానాన నన్ను బతకనీండి!... మీరు దొరబాబులు.. మాకూ మీకూ సానాదూరం.. మీసింత పుణ్యమా అని యిన్ని గంజినీళ్ళు కాసుకు తాగుతున్నా... అయి కూడా తాగనీరా? నీతిగా నీమంగా బతకనీరా? అంతా ఒకలాంటోళ్లే ఉంటారను కోకండి! నన్ను కొల్సుకు తింటే, మీకేటి నాబం? నన్ను కొట్టండి... సంపండిగాని, మీరు ఈ రోజుసేసిన పని మంచిదిగాదు బాబూ!

కాయన్న నాగులికి దగ్గరగావచ్చి 'ఏంటె నాగులూ అంతపాఠం సదివావు నేనేటన్నానని... నిన్ను చెట్టు దరికి రావొద్దన్నానా? ఆమాతిరం నాకూ దెల్సులే?'

ఏటి మీకు దెలిసింది? బాబూ! మా వొంటి రగతం పీలిసి తాగడవేనా? పాలికాపోళ్ళ కండలు కరిగిపొయ్యేనా పన్లు సేయించుకొని. కాలికింద సెప్పుల్ని తొక్కినట్టు తొక్కడవేనా? జాతీ నీతీ లేకుండా బతకడవేనా? నిప్పులా బతుకుతున్నాను... నా మరవన్నకోసం ఎదురుతెన్నులు సూస్తన్నా... పాతికేళ్ళొచ్చినయ్! పల్లెత్తుమాట బడలా... ఇంత కాలం సూసన్నా! ఎప్పుడో తప్పజారతాగ... ఖామంగులు...'

కారుమేఘం కమ్ముకొంటుంది... ఇంతలో యెండ...

అంతలో వర్షం... ప్రకృతి వైవిధ్యంలో రహస్యమే అంత!— కాయన్న బుసగొడుతున్నాడు. ఏమీ చేయలేక...

ఎన్నిమాటలు నేర్పింది చిలక!...

'సిన్నోడు సింతనిప్పు! ఆడు సూశాడో కపిత్తం గట్టి పాటపాడతాడు. నే తొలిగిపోతా...'

అనుకొని అడుగుల్లో అడుగువేసుకుంటూ గట్టెక్కింది.

నీటిలో మడి మునిగిపోయింది. దూరంనించి పాలికాపు కేకలేస్తున్నాడు.

'అరరె! మడి మునిగిపోయిందే! ఇంతా సేసి యిదా?' నాగుల్ని తిట్టుకొంటూ కాయన్న చెట్టుకింద చతికిలపడ్డాడు.

సిన్నోడి మేకలూ, గొర్రెలూ గరువెక్కుతున్నయ్ మేతలకి. నీరునిలిచిన కళ్ళతో నీరు నిలిచిన మళ్ళవైపు చూస్తూ.. నాగులు గట్టుమీద నిలబడి దిక్కులు చూస్తోంది.

మెట్టమీద సిన్నోడు వెదురుబొంగు ఊదుతున్నాడు తుమ్మచెట్టులా నిలిచి... ఆడిబతుకే అతుకులేంది! గొర్రెల్ని, మేకల్ని మేపుకొని, మందచేసి అమ్ముకొంటాడు. డబ్బుకుడబ్బు చేసుకొంటాడు— ఆనబతుకు ఎండిపోయిన పొగుగులో ఏదో వెతుకుతోంది. విప్పరాని ముళ్లతో, ముళ్ల దారిలో, చీకటిలో వొదీపంకోసం వెదుకుతోంది.

'ఈరోజు పస్తే! కాయన్న పున్నెమా' అని అనుకొంటూ ముందుకు నడిచింది. తుమ్మతోపుదగ్గర సిన్నోడెదురొచ్చాడు.

'సింతసివురు సివ్నాదానా? ఏమెట్టి చేతుల్తో యెల్లిపోతన్నావూ? కాయన్న సెట్టెక్క నివ్వలేదో?' అన్నాడు.

'పోరా! నీకంతా యెటకారం!' అంటూ తప్పించుకొంది.

'నాకుదెలుసులే! రగళ్యం!' అంటూ ముందుకు పోగాడు.

'సింతసివురు చిన్నది
ఎంతోహాసలు తున్నదీ'

'ఎం...త...హసు...లు...తు...న్న...దీ'

సినోడిమాటలు చెవుల్ని జోరీగల్లా కొరికి పారేస్తున్నయ్! నాగులు వంచిన మొఖం మెత్తకండా ముందుదారి వెతుక్కుంటూ గుడిసెవెంపు నడిచింది.

## 3

పొద్దు వాలిపోతోంది.

పొయ్యి మంటుతూన్నట్టుంది ఆకాశం ..పొగ మూరిన గోడల్లా మేఘాలు...పొగలుపొగలుగా ఊరుతున్నయ్!

నాగులు గబుక్కు చెట్టువైపు చూసింది.

చేలకుతోట కాల్చిన మంటల పొగలకి చివురు చివురంతా నల్లగా మాడిపోయివుంది.

నిన్న జరిగిందప్పుడే యెఱిక లేదా?'

మళ్ళీ మనసు వెనక్కు మళ్ళింది.

పాలెంనించి మరియమ్మ వచ్చి తన కొడుకుని మనువు చేసుకోమని బతిమిలాడింది.

'నా కొడుకిని సేసుకోయే కోడలా! బంట్రోతు పని. ఇన్ని జీతం రాళ్ళు. నిన్ను కోరి కోరి చేసుకొంటా నంటున్నాడు...కొదవమోకు...పక్కా చిలకా గోరింకల్లా కాపరం సేసుకొందురు గాని...'

'ససేమిరా' వల్లకాదంది. 'అంతా దగా! యెదవలు! నేనీ జన్మలో సేసుకోను'

అని కుండ బద్దలు కొట్టినట్టు పొమ్మంది.

ముసలయ్య పోరుపెట్టాడు. చావు సిద్ధమైనా...

ఐనా సరే!

'మొగోళ్ళని నమ్మకు!' అంటోంది మనసు.

'ఎవర్నీ నమ్మక యేమిటి సేసేది?' అంటోంది వయసు.

'అడివిగాసిన యెన్నెల సేయకు!' అంటోంది సొగసు. నిన్నల్లా కడుపులో కాళ్ళెట్టుకు నే పడుకొంట! ముసలయ్య రాత్రంతా ఒహాటే బాధ!.

ఆ బాధ చూడలేక యేడ్చింది...కడుపు కన్నీరు తాగింది. ఏంపనులూ దొరకని ఈ రోజుల్లో ఆదరువైన చెట్టు తిన్ని చూసి తరిమేస్తోంది. ప్రతిఫలం ఆశిస్తోంది.

చివరికి, చెట్టూ తనలాగే మాడిపోయింది.

దీనంగా దిక్కులు చూస్తోంది.

గట్టుదిగి తిన్నగా చెట్టు దగ్గరకొచ్చింది. నిన్నటి పచ్చదనం మచ్చుకైనా లేకండా పొగమూరిపోయింది. కాలిన అవయవముల్లా ఆకులు అల్లలాడుతున్నయి....

'నామీద యీసు, సెట్టేంసేసింది. దానిమీద బడ్డాడు? కాయన్న?'

తలలో మొలుస్తోన్న తలపులతో క్రుంగిపోతోన్న సంజెవైపు చూస్తోంది. కన్నీటిబొట్లు విదులుస్తోన్న మేఘాలు! తుమ్మలోపు కాలిపోతోన్నట్టు పొగలు పొగలుగా మూసుకుతోన్న చీకట్లు!

సినోడి అలికిడెక్కడా లేదు. అప్పుడేమందని మళ్ళించుకు పోయుంటాడు.

'సింతసెట్టు ఆడిపాటకి సంగీతం పాడేది. నాకు యీ బతుకుమీద యిరక్తి పుడతిన్నాది.'

నళ్ళలో అరకలుకట్టిన జాడలు నీడలుగా పరుచుకొన్నయ్. ప్రేమకోసం పలవరిస్తోంది ప్రకృతి...

ఎవర్నో పోగొట్టుకొని, ఎదురుచూస్తోన్నతను, ఈ సంజె చీకట్లో మరుగున పడిపోయినతను.

తనకో విషయం పొద్దున్నే తెలిసింది.

రహస్యపుటరలో దాచుకొంది—

గురవన్న మావ పట్నం వచ్చాడన్నారెవరో?

'పరిహాసంగా' అనుకొని వూరుకొంది.

'ఒక్కసారన్నా సూసేందుకు రాడా? తననీ ముసలయ్యనీ

'రాడు! ఏ మొఖం పెట్టుకొ నొస్తాడు? దేన్నో మనువుసేసుకొని...' గుండె చేదుగా మారింది.

'వస్తే రాకూడదా?'

'వచ్చి యెనకటిట్టు నే కళ్ళమూస్తే?'

# సింత సివురు

'ఎంచక్కా వుంటది! ఇంతవయసూ ఓసారి పులకరించిపోతది'—ఊహాలు పోతోన్న నాగులు కళ్లు పాకలోకి పోతోన్న దారిలో మనుషులు నడక పసిగట్టి ఆవైపే నిగిడించి చూస్తోంది.

ఎవర్నో ఎలుగెత్తిన పిలుపు...

ఆపిలుపు తనకి వినిపించడంలేదు.

చీకట్లు కమ్ముతోన్న తనకళ్ళకి సంజె ఎఱ్ఱని పెనవులు చప్పరిస్తోన్న చప్పుడులాంటి భావం—

ఆడెవరో మిలిటేరి సిపాయి...

తిన్నగా చెటుకిందకే వస్తావున్నాడు భయం భయంగా ముడుచుకుపోతోంది శరీరం...

ఎవరోవాడు? తన్నెత్తుకుపోయే రాక్షసుడు!

'ఆడది కంటబడితేసాన... గెద్దల్లా తన్నుకుపోతారు సిపాయీలు' అని చెప్పుకుంటేవాడు ముసలయ్య...

అందరూ కళ్ళముందు మెసిలారు...ముసలయ్య, గొల్లలసిన్నోడు....రాయన్న....కురవన్నమావ.... అందరూ?

దగ్గిరికి కలువపూవులా ముడుచుకుపోయింది. చీకట్లో వెన్నెల్లా విరుస్తోన్న జీవితం—

'నేనే... నేనే...భయపడతావేం?' అన్నాడు సిపాయి.

గొంతు మాంసంముద్ద మింగుతోన్నట్టు వినిపించింది.

సిపాయిని, నిండుగా కళ్లెత్తిచూసింది. బావురుమన్నది.

'పిచ్చిదానా! అంతహడలెందుకే! నిన్నేం మింగేసేరాక్షసుణ్ణా? ఒక్కసారి కన్నెత్తిమాడు! అంత బేజారెత్తిపోతావేం?......నీకే విచారమూ వొద్దింక...'అన్నాడు సిపాయి చనువుగా...

'మాఅయ్య సావుబతుకుల్లో వున్నాడు! నువ్వెరవో నేనెరగను పో! అంతా ఐపోనాక యెందుకొస్తి?'

అంది గొంతు పెగుల్చుకొని...

బొద్దుమీసాలు, బలిసినవొళ్ళూ, కండలుదిరిగిన జబ్బలూ...తూపుల్లాంటి సూపులూ...ఈడేనా?... ఈడేనా?...

సిపాయి, సిపాయిలా గర్జించాడు.

'నాకవతల టయింలేదు. ఈబండికెళ్లిపోవాల... పోకపొయ్యేనో? ఉద్యోగం ఊడిపొద్ది...ఊఁ బయల్దేరు...'

నాగులు లేచింది. అతనివెంటబడింది బతకడానికి.. ఎంతదూరంనించి వొచ్చాడో ఈసిపాయి మావఁతన్ని వెదుక్కుంటూ...

చీకటి యిరువుర్నీ కౌగలించుకొంటోంది...నక్షత్రాలు కన్నుగీటుతున్నయి...కీచురాళ్ళ సంగీతం... సెవుల్ని బూజుదులుపుతోంది...

గరువుమీదకెక్కి చింతచెట్టువైపు చూసింది. చీకట్లోమునిగిపోయింది. గట్లకడ్డం బడ్డారు. నల్లని మళ్ళలో నీళ్లు నక్షత్రాల కాంతికి తళతళలాడుతున్నయ్!

రోడ్డుమీదకొచ్చారు.

'మాఅయ్యసంగతీ...'

'ఆడీనాడే పోయాడు. నువ్విలారాంగానే, కళ్లుమూసుకొన్నాడు... నేను రూడెంలో కళ్ళేసరికి అందరూ చెప్పుకొంటున్నారు. నువ్విక్కడున్నావని వచ్చాను. ఎంతోటయింలేదు. బండివచ్చేవేళ...జాగుచేశావో, బండిజారిపొద్ది...'

'నేనురాను మావాఁ! నన్నిడిసిపెట్టు ... నా బతుకు నాకొదిలెయ్!'

కన్నీళ్ళు తెలియకుండా ధారాపాతంగా వర్షించాయి.

సిపాయి కురువన్న నాగులు చేతులొడిసిపట్టి, విడిచిపెట్టకండా లాక్కెడుతున్నాడు...

తనవలపుచింతలు అందంగా చివురించడానికి వెడుతున్నది సిపాయికురువన్నతో...ఆచింతలు చివురించినపుడే తనకోర్కెలగోళ్లు ఎఱుపెక్కుతయ్!

'సింతసివురు సిన్నదీ
సీకుసింత లేనిదీ'

సిన్నోడిపాట! ఎక్కడికెళ్లినా నాగులు బతుకంతా చివురిస్తూనే వుంటుంది!